• అశేష జనంతో కేసీఆర్ సభ కళకళ

వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నికల్ కళాశాల మైదానంలో అక్టోబర్ 26న ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో మైదానం మొత్తం జనంతో కిక్కిరిసిపోయింది. కేసీఆర్ ప్రసంగం విన్న ప్రజలు చప్పట్లతో మద్దతు తెలిపారు.

• జనం లేక రేవంత్ సభ వెలవెల

కేసీఆర్ నిర్వహించిన వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలోనే మంగళవారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ జనంలేక వెలవెలబోయింది. గత ఆదివారం ఇదే మైదానంలో భారత్-ఆస్ట్రేలియా ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌ను ఎల్‌ఈడీలో చూసేందుకు వచ్చినంత జనం కూడా రాలేదు. మైదానమంతా ఖాళీగా దర్శనమివ్వగా.. రేవంత్ అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. పీసీసీ చీఫ్ రేవంత్‌కు, సీఎం కేసీఆర్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ ఇలా ఉంటుందని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

1.60 లక్షల కొలువులు భర్తీ

- ఉద్యోగ గణాంకాల వెబ్‌సైట్‌లో వివరాలు
- ట్విట్టర్‌లో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇప్పటివరకు 1,60,083 ఉద్యోగాలను భర్తీ చేసినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు వెల్లడించారు. జనాభా ఆధారంగా దేశంలోనే అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంగళవారం ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వివరాల కోసం https://telanganajobstats.in వెబ్ సైట్‌ను చూడాలని, దీనిలో అన్ని వివరాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదిన్నర ఏండ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించామని ఆయన పేర్కొన్నారు.

• కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవు

నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని నందిపహాడ్, లక్కాయపల్లి, పల్లెర్ల గ్రామాల్లో మంగళవారం గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలప్పుడు వచ్చే కాంగ్రెస్ నేతల మాటలను నమ్మొద్దని సూచించారు. -మద్దూర్ (కొత్తపల్లి)

కాంగ్రెస్ అభ్యర్థి నోట.. 'జై కేసీఆర్'

- గొంతు కలిపిన గ్రామస్థులు
- అవాక్కైన కాంగ్రెస్ శ్రేణులు
- పాలకుర్తి అభ్యర్థి వీడియో వైరల్

జనగామ, నవంబర్ 21(నమస్తే తెలంగాణ) : సీఎం కేసీఆర్ పదేండ్ల పాలన అన్ని వర్గాలను మెప్పించింది. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం అంగీకరిస్తున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి ఎన్నికల ప్రచార సభలో జై కేసీఆర్ అంటూ నినదించారు. ఆమెతో గ్రామస్థులు సైతం గొంతు కలిపి జై కేసీఆర్.. జైజై బీఆర్ఎస్ అనడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. నెటిజన్లు పెద్దఎత్తున కామెంట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తో పోటీ పడుతున్న యశస్విని మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరు మండలం మడిపెల్లిలో ఎన్నికల ప్రచార రథంపై నుంచి గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముగింపులో ఇక ఉంటా అంటూ జై కేసీఆర్ అని నినదించడంతో పక్కనే ఉన్న కాంగ్రెస్ నాయకులు బిత్తరపోయి మేడం అనడంతో ఆ మె వెంటనే తేరుకొని జై కాంగ్రెస్ అన్నారు. ఇ దంతా చూసిన గ్రామస్థులు ఈలలు కొట్టి ఒక్కసారిగా గొల్లున నవ్వుకున్నారు. మేడం కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నా కేసీఆర్ అంటే అభిమానం, బీఆర్ఎస్ అంటే ప్రేమ ఉన్నట్టుంది అంటూ గుసగుసలాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి నోట జై కేసీఆర్ నినాదం రాజకీయ దుమారానికి దారితీసింది.

ఎన్నికల అధికారులపై కాంగ్రెస్ గూండాగిరి

- ఈవీఎంలో సీతక్క ఫొటో చిన్నగా ఉందని హల్‌చల్
- ఆరు గంటలపాటు ఆర్వోను నిర్బంధించిన శ్రేణులు
- అర్ధరాత్రి ఒంటి గంటకు ఆర్వో కార్యాలయానికి సీతక్క
- చేతులు జోడించి దండం పెట్టిన ములుగు తహసీల్దార్

కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కకు రెండు చేతులు జోడించి దండం పెడుతున్న తహసీల్దార్

ములుగు, నవంబర్ 21 (నమస్తేతెలంగాణ): ములుగులో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆర్వో కార్యాలయం వద్ద గూండాగిరి చేశారు. సోమవారం రాత్రి 9 నుంచి అర్ధరాత్రి వరకు ఆరు గంటలపాటు ఆర్వోను నిర్బంధించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ(సీతక్క) ఫొటో ఈవీఎం మెషిన్‌లో చిన్న సైజు చేసి కనిపించకుండా చేశారని ఆరోపిస్తూ హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. 'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. అప్పుడు మీ అంతు చూస్తా'నంటూ బెదిరించారు. కార్యాలయంలో ఉన్న ఆర్వో అంకిత్ బయటకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకొని.. విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని చెప్పినా పట్టించుకోకుండా.. కలెక్టర్ ఎవరు? నియోజకవర్గానికి ఆర్వోనే బాస్ కదా! ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలి అంటూ పట్టుబట్టారు. పోలీసులు, ఎన్నికల అధికారులు ఎంత నచ్చజెప్పినా వినకుండా కాంగ్రెస్ నాయకులు కలెక్టర్, ఆర్వో, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీతక్క అర్ధరాత్రి ఒంటి గంటకు ఆర్వో కార్యాలయానికి చేరుకొని అధికారులపై చిర్రుబుర్రులాడారు. చేసేది లేక ఏఆర్వో, ములుగు తహసీల్దార్ విజయ్‌భాస్కర్ బయటకు వచ్చి సీతక్కతోపాటు కాంగ్రెస్ నాయకులకు రెండు చేతులు జోడించి దండం పెట్టి.. మంగళవారం ఉదయం రావాలని, కలెక్టర్ సమక్షంలో తమ అభ్యంతరాలను పరిశీలిస్తామని చెప్పి వేడుకోవడంతో ఆందోళనను విరమించారు. ఉదయమే కాంగ్రెస్ నాయకులు ఆర్వో కార్యాలయానికి వెళ్లి తమ అభ్యంతరాలను తెలియజేయగా అధికారులు నివృత్తి చేసినట్టు సమాచారం. ఈ మాత్రం దానికి ఇంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముందని? సీతక్క, ఆమె అనుచరులు ప్రవర్తించిన తీరును ప్రజలు ఖండిస్తున్నారు.

జీఎస్‌డీపీ వృద్ధిలో మనమే టాప్

- నిరుడు ఏకంగా 11.97 శాతం వృద్ధి
- దేశంలో ఏ రాష్ట్రానికీ అందనంత ఎత్తుకు చేరిన తెలంగాణ
- 'ది ఇండియన్ ఇండెక్స్' వెల్లడి
- రాష్ట్ర ఆర్థిక ప్రగతికి నిదర్శనం
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ హర్షం

హైదరాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఆర్థిక రంగంలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతి మరోసారి దేశం ముందు సాక్షాత్కారమైంది. రాష్ట్రాల ప్రగతికి ప్రధాన ప్రామాణికాలైన జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణకు తిరుగులేదని తాజాగా మరోసారి రుజువైంది. ఈ రెండు అంశాల్లో ఇప్పటికే నంబర్‌వన్ స్థానానికి ఎగబాకిన తెలంగాణ.. నిరుడు (2022-23 ఆర్థిక సంవత్సరంలో) జీఎస్‌డీపీలో ఏకంగా 11.97 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. తద్వారా తెలంగాణ దేశంలోని మరే ఇతర రాష్ట్రానికీ అందనంత ఎత్తులో నిలిచినట్టు 'ది ఇండియన్ ఇండెక్స్' తాజా నివేదిక వెల్లడించింది. దీంతో 'ఆదాయాన్ని పెంచడం.. ప్రజలకు పంచడం' అనే సీఎం కేసీఆర్ ఆర్థిక సూత్రం సూపర్‌హిట్ అయినట్టు మరోసారి రుజువైంది. ఓ వైపు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అనాలోచిత నిర్ణయాలతో దేశాన్ని ఆర్థికంగా కొలుకోలేని దెబ్బ తీస్తుంటే.. మరోవైపు సీఎం కేసీఆర్ తెలంగాణను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. అందుకు నిదర్శనమే 'ది ఇండియన్ ఇండెక్స్' నివేదిక. జీఎస్‌డీపీ వృద్ధిలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలవడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఇదొక నిదర్శనమని ట్వీట్ చేశారు.

2022-23లో రాష్ట్రాల జీఎస్‌డీపీ వృద్ధి తీరు

రాష్ట్రం	వృద్ధి శాతం		
తెలంగాణ	11.97	మధ్యప్రదేశ్	10.43
కేరళ	11.93	ఉత్తరప్రదేశ్	10.20
జమ్ముకశ్మీర్	11.09	ఢిల్లీ	9.14
రాజస్థాన్	11.36	మహారాష్ట్ర	9.13
హర్యానా	11.32	బిహార్	8.46
ఒడిశా	11.26	ఛత్తీస్‌గఢ్	8.46
ఆంధ్రప్రదేశ్	11.23	ఉత్తరాఖండ్	8.19
కర్ణాటక	10.96	అస్సాం	8.06
జార్ఖండ్	10.87	తమిళనాడు	7.92
పశ్చిమ బెంగాల్	10.76	హిమాచల్‌ప్రదేశ్	7.55
గుజరాత్	10.56	పంజాబ్	6.51
		గోవా	4.10

ఏనుగు రవీందర్‌రెడ్డి కబ్జాకోరు

- బాన్సువాడ ప్రజలు జాగ్రత్త
- ఎల్లారెడ్డిలో తిరస్కరిస్తే బాన్సువాడకు వచ్చిండు
- మీడియాతో భూబాధితులు

బాన్సువాడలో మీడియాతో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి భూ బాధితులు

బాన్సువాడ, నవంబర్ 21: ప్రభుత్వ, పేదల భూములను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి మింగేశాడని బాధితులు ఆరోపించారు. రవీందర్‌రెడ్డి స్వగ్రామమైన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌కు చెందిన భూబాధితులు చిట్యాల సాయన్న, దుర్గవ్వ, గాదె బాలయ్య మంగళవారం బాన్సువాడలో మీడియాతో మాట్లాడారు. 40 ఏండ్ల క్రితం ప్రభుత్వం 25 మంది దళితులకు 30 ఎకరాల అసైన్డ్ భూమిని ఇచ్చిందని తెలిపారు. పక్కనే ఏనుగు రవీందర్‌రెడ్డి 300 ఎకరాలు కొనుగోలు చేసి తమ భూములను కబ్జా చేశాడని ఆరోపించారు. భూముల కబ్జాపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసి, పోలీసు స్టేషన్‌లో వేసి కొట్టించాడని తెలిపారు. కబ్జాకోరు రవీందర్‌రెడ్డిని ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు తిరస్కరిస్తే బాన్సువాడకు వచ్చినట్టు తెలిపారు. రవీందర్‌రెడ్డిని నమ్మి ఓటేస్తే బాన్సువాడ ప్రజలు ఎల్లారెడ్డి ప్రజల మాదిరిగా మోసపోతారని హెచ్చరించారు.

పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి.

బీఆర్ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు

- కాంగ్రెస్ మాటలకు మోసపోవద్దు
- సంక్షేమం, అభివృద్ధి మాయమైతయి
- రజక, పద్మశాలి, ఆకృతి టౌన్‌షిప్ ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ / శామీర్‌పేట / ఘటకేసర్ రూరల్/ బోడుప్పల్: అభివృద్ధితోపాటు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉన్నదని కార్మిక శాఖ మంత్రి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో గ్రామ రజక సంఘం ఆత్మీయ సమ్మేళనం, బోడుప్పల్ ఆకృతి టౌన్‌షిప్‌లో కార్పొరేటర్ పులకండ్ల హేమలత జంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంతోపాటు శామీర్‌పేటలో నిర్వహించిన మేడ్చల్ జిల్లా పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాలు, కులాలను సీఎం కేసీఆర్ ఆదుకున్నారని చెప్పారు. పథకాలు, ప్రోత్సాహకాల ద్వారా కులవృత్తులను బలోపేతం చేశారని వివరించారు. ఒకప్పుడు ఉపాధి కరువై వలస వెళ్లినవారు బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలతో స్థానికంగా ఉపాధి పొందుతున్నారని, ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్‌వి కల్లబొల్లి మాటలు

కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నా కాంగ్రెస్‌ను ఎన్నికల్లో మట్టి కరిపించాలని మంత్రి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మాటలు నమ్మి అధికారం అప్పజెప్పితే మోసపోవడం ఖాయమని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి, సంక్షేమ మాయం అవుతాయని, అవినీతి, అరాచకాలు పెరిగిపోతాయని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ నిధులతోపాటు సొంత నిధులను సైతం వెచ్చించానని తెలిపారు. అలియాబాద్‌లో పద్మశాలి సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు రక్షణ కల్పించామని చెప్పారు.

హ్యాట్రిక్ సీఎం కేసీఆరే!

- కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాష్ట్రానికి చేసిందేమీ లేదు
- సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను సమానంగా ఆదుకున్నారు
- ఫిట్‌నెస్, సర్టిఫికెట్ చార్జీలు మాఫీ హామీకి కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రికి జీవితాంతం మేమంతా రుణపడి ఉంటాం
- ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకొని తీరుతాం
- గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్లు స్పష్టం

హైదరాబాద్ నాచారంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆటో రిక్షా కార్మికులకు సీఎం కేసీఆర్ తీపి కబురు చెప్పడంపై గ్రేటర్ హైదరాబాద్ ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హ్యాట్రిక్ సీఎం కేసీఆరేనని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఆటోలు నడుపుతూ కారు గెలుపునకు కృషి చేస్తామని స్పష్టంచేస్తున్నారు. 70 ఏండ్ల కాంగ్రెస్, బీజేపీ పాలనలో సామాన్యుల బతుకులకు భరోసా లేదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కరోనా కష్టకాలంలో మోటార్ వాహన పన్ను రద్దు, డ్రైవర్ కం ఓనర్, రూ.5 లక్షల ప్రమాదబీమాతో ఆదుకోగా, తాజాగా ఆటోల ఫిటెనెస్, సర్టిఫికెట్ చార్జీలను మాఫీ చేస్తామని ప్రకటించడం కేసీఆర్ మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. తక్కువ ఆదాయమున్న ప్రతి ఆటో డ్రైవర్‌కు సాయం చేసే కార్యక్రమం ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కారే గెలుస్తున్నది

ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని ప్రత్యేకంగా పరిగణించి సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారు. ఇంతకన్న గొప్ప వ్యక్తి ఎవరుంటరు. కాంగ్రెస్, బీజేపీలు ఏనాడూ ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించిన పాపానపోలేదు. సీఎం కేసీఆర్ అలా కాదు, మా కష్టాలు తెలుసుకొని అన్ని విధాల ఆదుకుంటున్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నారు.

- శాతం రమేశ్, ఆటో డ్రైవర్

కేసీఆర్ మాట ఇస్తే తప్పరు

ఆటోలపై తెలంగాణలో పన్ను లేదు. దీనికి తోడు ఫిట్‌నెస్ చార్జీల మాఫీ హామీ గొప్ప విషయం. సంక్షేమ పథకాలన్నింటినీ పొందుతున్నాం. వాటికి తోడు ఆటోలతో వచ్చే ఆదాయం మా జీవితాలకు భరోసా నిస్తున్నది. కేసీఆర్ సీఎం అవడం కోసం నిరంతరం పనిచేస్తాం.

-తాటికాయల కుమార్, ఆటో డ్రైవర్

కేసీఆర్ పాలనను విదేశీయులు మెచ్చుకున్నరు

తెలంగాణ ప్రభుత్వ పథకాలు ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. చాలామంది విదేశీయులు హైదరాబాద్‌లో పర్యటించేందుకు వస్తుంటారు. వారంతా కొన్నిసార్లు మా ఆటోలు ఎక్కుతుంటారు. వారు సీఎం కేసీఆర్ పాలన బాగుందంటూ మెచ్చుకుంటారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, సుందరీకరణ పర్యాటక ప్రదేశాలు, గొప్పగొప్ప చారిత్రక కట్టడాలు ఇలా ఎన్నింటోనో వారంతా చూస్తూ ఆనందిస్తారు. సీఎం కేసీఆర్ పాలన తెలంగాణకు అత్యంత అవసరం.

-కర్నె రామాంజనేయులు, ఆటో డ్రైవర్

కాంగ్రెస్ నేత వివేక్ ఇంట్లో సోదాలు

- హైదరాబాద్, చెన్నూరులో ఐటీ, ఈడీ తనిఖీలు
- ఫ్రీజ్ చేసిన రూ.8 కోట్ల నగదుపై అధికారుల ఆరా
- పార్టీలకు నిధులిచ్చిన వ్యాపారుల ఇంట్లో కూడా

హైదరాబాద్/మంచిర్యాల, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జ్యోతినగర్/జమ్మికుంట: అసెంబ్లీ ఎన్నికల వేళ డబ్బునే నమ్ముకున్న నేతలపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. ఈడీ ఆదేశాలు, సమాచారం మేరకు ఇన్‌కం ట్యాక్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వివేక్ వెంకటస్వామి నివాసాల్లో ఐటీ, ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌తోపాటు ఆయన పోటీ చేస్తున్న చెన్నూరులో కూడా తనిఖీలు చేపట్టారు. చెన్నూరులోని వివేక్ ఇంటికి తెల్లవారుజామున 5.30 గంటలకు చేరుకున్న ఈడీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. వివేక్‌కు చెందిన కంపెనీల డబ్బులను చెన్నూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగినట్టు తెలిసింది. ఆ సమయంలో నివాసంలో వివేక్ లేకపోవడంతో ఇంటి వాచ్‌మెన్ సమక్షంలో తనిఖీలు చేశారు. ఇటీవల ఫ్రీజ్ చేసిన రూ.8 కోట్ల లావాదేవీలపై కూడా అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు వివేక్ నివాసానికి చేరుకొని నిరసన తెలిపారు. కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా పోలీసులు వారిని చెదరకొట్టారు. సోదాలు నిర్వహించిన తర్వాత పంచనామా కాపీని వాచ్‌మెన్‌కు అందజేసి వెళ్లిపోయారు. హైదరాబాద్ నివాసంలో కూడా సుమారు 4 గంటలపాటు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విలువైన డాక్యుమెంట్లు, డిజిటల్ వస్తు సామగ్రి, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఖమ్మం కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులదిగా భావిస్తున్న రూ.7.5 కోట్లపై ఐటీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు.. ఈడీ అధికారికంగా రంగంలోకి దిగనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న శ్రీనిధి ఇంటర్నేషనల్ చైర్మన్ కేటీ మహేందర్ వాంగ్మూలం కీలకంగా మారున్నది.

వ్యాపారులపై 'ఐటీ' దాడులు.. కాటన్ మిల్లుల్లో సోదాలు

కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట కాటన్ మిల్లుల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. మిల్లుల్లో భాగస్వాములైన ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ నివాసాల్లోనూ సోదాలు చేశారు. మరికొందరు భాగస్వాములను ఆదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ఆర్నెళ్లుగా సదరు వ్యాపారులు ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేసి ఓ పార్టీకి చెందిన నేతకు నిధులు సమకూర్చారనే ఆరోపణల నేపథ్యంలో దాడులు చేపట్టి తెలుస్తున్నది. నాలుగు వాహనాల్లో 10 మందికిపైగా ఐటీ అధికారులు, సిబ్బంది కేంద్ర బలగాల సిబ్బంది సహాయంతో జమ్మికుంటకు వచ్చినట్టు తెలిసింది. ఇంట్లో ఉన్న వ్యక్తుల, మిల్లులోని సిబ్బంది వద్ద ఉన్న సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డోర్లు, మిల్లు గేట్‌లను మూసేశారు. ఆయా మిల్లుల్లో ఐటీ అధికారుల తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

టెలికం భద్రత సమావేశంలో పాల్గొన్న మహేశ్ భాగవత్ తదితరులు

ఫోన్ల రికవరీలో దేశంలోనే మనం టాప్

- తెలంగాణ సీఈఐఆర్‌కు అభినందన
- టెలికం సెక్యూరిటీ సౌత్‌జోన్ మీటింగ్‌లో తెలంగాణ సీఐడీ చీఫ్ మహేశ్‌భాగవత్

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): చోరీకి గురైన, పోయిన మొబైల్ ఫోన్ల రికవరీలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలంగాణ సీఐడీ చీఫ్ మహేశ్ భాగవత్ తెలిపారు. దేశం మొత్తంలో 35 శాతం రికవరీ రేటుతో మనం టాప్‌లో ఉన్నట్టు చెప్పారు. దక్షిణ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించినట్టు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ వివంతాలో టెలికం భద్రతపై మంగళవారం నిర్వహించిన సౌత్‌జోన్ స్థాయి సమావేశంలో మహేశ్ భాగవత్ మాట్లాడారు. కేవలం ఏడు నెలల్లో 12,500లకుపైగా ఫోన్లను వెతికి వినియోగదారులకు అందించామని చెప్పారు.

కాకినాడ జిల్లాలో పడవ బోల్తా

ఇద్దరు మత్స్యకారుల గల్లంతు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : ఏపీలోని కాకినాడ జిల్లాలో ఇద్దరు మత్స్యకారులు గల్లంతయ్యారు. సోమవారం సాయంత్రం ఐదుగురు మత్స్యకారులు నాటు పడవపై చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. ఈదురు గాలుల, సముద్ర అలలకు పడవ బోల్తా పడింది. దాంతో ఐదుగురు జాలర్లు సముద్రంలో గల్లంతయ్యారు. ముగ్గురు జాలర్లు ఈదుకుంటూ తీరానికి చేరుకొన్నారు. మిగతావారి కోసం మెరైన్ సిబ్బంది గాలిస్తున్నారు.

కులవృత్తులను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్‌కు మద్దతు

గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్

ఆత్మీయ సమావేశంలో అభివాదం చేస్తున్న రాష్ట్ర గౌడ సంఘం నాయకులు

మల్కాజిగిరి/అల్వాల్, నవంబర్ 21: కులవృత్తులను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గౌడ సంఘం సంపూర్ణ మద్దతునిస్తున్నదని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం అల్వాల్ లోతుకుంటలో గౌడ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ చుట్టూ ఉన్న 270 సొసైటీలు 103 కల్లు దుకాణాలను గత 2006లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మూసివేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నిర్ణయంతో నాడు లక్షమంది రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ మొదటి మంత్రివర్గ సమావేశంలో కల్లు, గీత కార్మికుల సంక్షేమం కోసం కల్లు దుకాణాలను తెరువాలని నిర్ణయించారని చెప్పారు. ఏటా రూ.20 కోట్లు కిరాయిని సైతం మాఫీ చేశారని కొనియాడారు. సర్దార్ పాపన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ జ్యోతిగౌడ్, గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నేమూరి శ్రీధర్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, శోభగౌడ్, రాజేశ్‌కన్న, నక్క రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.